స్వప్న సమీరం

కాకతీయ కళాతృష్ణకు, దైవభక్తికి ప్రతీకగా నిల్చుంది భోగేశ్వరాలయం. ఆలయం మంటపం చుట్టూ పలు భంగిమల్లో చెక్కిన సుందరాంగుల ఆకృతులు శిల్పాలుగా నిల్చాయి. చూపరులనిట్టే ఆకట్టుకుంటాయవి. ఆ భోగేశ్వరాలయ ప్రాంగణములో సినిమా షూటింగ్ జరుగబోతుంది. ఆ వేడుకను కళ్లారా చూచి మనసారా ఆనందించేందుకొస్తున్న తండోపతండాలైన జనాల్లో ప్రేమానందం మిత్రబృందం నడుస్తుంది. మిత్రులవైపు కొత్తగా చూచాడు ప్రేమానందం... విన్నారా ! అన్నట్టుగా "ఏది ఏమైనా సరే నేనో సిన్మా యాక్టర్నై తీరుతా!" అన్నాడు మరోసారి.

బ్రహ్మాండమైన జోకు విన్నట్టు పగలబడి నవ్వారొక్కసారే. పిచ్చోడిముందు పిల్లకాయల్లా కేకవేశారు మిత్రులు. "కొయ్యకురా కోతలు!" భుజం చరిచాడు ధన్‌రాజ్.

"నాలాగ పాటలు రాసినోళ్లంతా సిన్మా కవులు కాలేరు. మన రవి గాడిలా ఇంజక్షనివ్వగలిగినోళ్లంతా డాక్టర్లు కాలేరు. నీలాగ నాటకాల్లో వేషాలేసి నోళ్లంతా సిన్మాయాక్టర్లు కాలేరు. దానికి అదృష్టం, అవకాశం కలిసి రావాలి నాయానా!" పసలేని పిటిషన్ను డిస్మిస్ చేసిన జడ్జిలా కొట్టిపారేశాడు శశికాంత్.

"మనిషి ఆశాజీవి. కాని ఆకాశానికి నిచ్చెన్లు వెయ్యడం అవివేకం. మరట్లాగే అంటుండండి. నేను మాత్రం...." ఇంకేదో అనబోతున్న ప్రేమానందం నోరు అరచేత్తో మూసేసాడు దయానంద్ తన అరచేత్తో.

"నీ బొంద! ఉద్యోగాల్లో సెటిలయ్యాం. పెళ్లిళ్లైపోయినై. పిచ్చిపిచ్చి ఊహలు మానేసి ముందుకు నడవండి ఇలాగే పెళ్లి నడక నడిస్తే అక్కడ షూటింగ్ షురువైపోతుంది."

"పెళ్లైతే మాత్రం.. పట్టుదలలో పట్టు సడలలేదుగదా! పెళ్లయ్యాక సిన్మాయాక్టరైనోడే లేడా?"

ధన్‌రాజ్‌కు చిర్రెత్తింది

"ఒరేయ్! ఎక్కువగా మాట్లాడ్తే నీ పేరు ప్రేమానందం నుండి దోమానందంగా మారిపోతుంది. పక్కబొక్కలు జాగ్రత్త!" పళ్లు పటపటలాడినై ప్రేమానందం నోరు మూతపడింది చూపులు మాత్రం నువ్వు చూస్తూనే ఉండు నేనో సిన్మా హీరోనై తీరుతా. నన్నట్టుగున్నాయి.

ఊరి జనాలంతా భోగేశ్వరాలయం చుట్టూ విరగబడ్డారు. ఇసుకవేస్తే రాలనంత జన సందోహం. అరగంటసేపు సమిష్టి భజబలం ప్రదర్శించి ప్రహరీ గోడెక్కి కూచోగల్గింది ప్రేమానందం మిత్రబృందం. బరానీలు కొని నమల్తున్నారు. ఓపక్క పోలీసు లాఠీలు గాల్లోకి లేస్తున్నాయి. మరోపక్క జనాల కుమ్ములాటలు, అరుపులు.. శివరాత్రినాటి కొమురవెల్లి జాతరలాగుంది షూటింగ్ స్పాట్.

బ్యూటీ క్వీన్ లవంగితో మేటి హీరో సుగుణాకర్‌ల మీద యుగళగీతం షూటింగట. సినిమా కంపెని వర్కర్లు చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు షూటింగ్ ఎప్పుడు ప్రారంభమౌతుందాని ఒళ్ళంతా కళ్లు జేసుకుని చూస్తున్నారంతా. కుడుకుల కుండలోంచి గసం గింజ రాలినట్టుగా గుంపులోంచి బయటికొచ్చాడో సాదామనిషి. కంగారుగా ఉన్నాడు. ఎవరికోసమో వెతుకుతున్నాడు.

"ప్రేమానంద గారెవరండీ?. అడిగాడు ప్రేమానందాన్నే ప్రేమానందం రవి వెపు చూశాడు ఈ గొట్టంగాడెవర్రా?

"అన్నట్టు పోవోయ్ పో! మా వాణ్ని దింపి నువ్వుకూచుందామనుకున్నావేమో .. ఆ పప్పులు

మాదగ్గరుడకవు ఫో! ఝాడించి పారేశాడు రవి. బుర్రగోక్కున్నాడా మనిషి రెండు చెతుల్తో "కాదండీ. నేనూ... నేను. ."

"నువ్వెవడివైతే మాకేం గానీ వెళ్లిరా నాన్నా!" నాగరాజు డైలాగు గొల్లున నవ్వారంతా. ఆ మనిషిలోకంగారెక్కువైంది.

"ప్లీజ్ చెప్పండి. నేనీ సిన్మా అసిస్టెంటు డైరెక్టర్ని."

"ఐతే మాత్రం మా ప్రేమానందాన్ని గోడ దింపి తీరాలా?" ప్రేమానందాన్ని గట్టిగా పట్టుకున్నాడు రవి.

"అయ్యో... అది కాదండీ హీరో సుగుణాకర్ బాత్రూంలో కాలుజారి పడిపోయాడు. కాలు విరిగింది హైద్రాబాదు తీసుకెళ్లారు ఈ ఊళ్లో ప్రేమానందమనే ఫేమస్ స్టేజీ యాక్టరున్నారటా...." అంజనేయుడు లంకలోకి లంఘించినట్టు గోడ కూకేశాడు ప్రేమానందం

"నేనేనండీ. స్టేజీ యాక్టర్ ప్రేమానందాన్ని నేనే!"

"హమ్మయ్య... మీరోసారి నాతో రండి" చెయ్యి పట్టుకు లాక్కెళ్లాడు స్నేహితులవైపు చూసేందుగ్గూగా అవకాశమివ్వలేదు.

"చూడండి ప్రేమానందం గారూ!" డైరెక్టర్. . సాక్షాత్తు సిన్మా డైరెక్టర్ చేతులు జోడించాడు. "ఈ సినిమాలో ఇదే మొదటి షూటింగ్ హీరో సుగుణాకర్ గారి కాలు విరిగింది. హైద్రాబాద్ హాస్పిటల్‌కు పంపించాం. అతనిప్పుడప్పుడే పంజెయ్యలేడు అతని బదులుగా ఈ సినిమాలో మిమ్మల్ని హీరోగా వేసుకుంటున్నాం. మీ నటనా చాతుర్యాన్ని ప్రదర్శించి మీకూ, మాకు పేరొచ్చేలా చూడండి".

"ఈ షూటింగ్‌కోసం ఇప్పటికే లక్షలు ఖర్చైంది. ఏర్పాట్లన్నీ పూర్తైనై. షూటింగిప్పుడు కాన్సిలైతే బోలెడంత నష్టం, మీరెన్నో నాటకాల్లో వేసి బోలెడన్ని బహుమతులు గెల్చుకున్నారని విన్నాం. ప్లీజ్! ఈ పాత్ర ఒప్పుకోండి. రెమ్యునరేషన్ సుగుణాకర్ కంటే ఏ మాత్రం తగ్గదు." అగ్రిమెంటు ముందుంచాడు నిర్మాత. వెతకబోయిన తీగ కాలుగు చుట్టుకున్నట్టుంది ఓఫ్ .... అదృష్టమంటే నాదే. .ప్రేమానందం ఎదలో

ఆనందకెరటాలెగసిపడిన్నై బయట పడితే చులకనైపోవచ్చు. బింకం ఏ మాత్రం తగ్గొద్దాయె.

"సరే... మీరంతగా అంటున్నారు కాబట్టి ఒప్పేసు కుంటున్నాను" అగ్రిమెంటు మీద సంతకం చేశాడు.

షూటింగ్ సన్నివేశం, దాని నేపథ్యం వివరించాడు డైరెక్టర్. డాన్స్ డైరెక్టర్ పాట మీద స్టెప్పులేసి చూపించాడు. హీరోయిన్ లవంగితో రిహార్సలైంది. నవ్వుల పువ్వులు రాలిపడిన్నై.

"భేష్‌ప్రేమానందం గారు!" డైరెక్టర్ తృప్తిగా ఊపిరి పీల్చుకున్నాడు..

ఒకే ఒక పాట... లవంగి, ప్రేమానందంల మీద యుగళగీతం. షూటింగ్ సాయంత్రం దాకా సాగింది. ఉరుకుల, పరుగులు, కౌగిలింతలు, ముద్దులు... పాట నిండా అవే. ప్రేమానందం మిత్రమండలి సంతోషానికధుల్లేవు. చప్పట్ల వర్షం కురిసింది. "మనవాడు అసాధ్యుడేరా" అనుకున్నారప్పుడు.

సంధ్యా సమయం చీకటి తెరలు దిగుతున్నై. సినిమా బృందం హోటల్ అమరావతి చేరుకుంది. భోజనాలప్పుడు లవంగి ప్రేమానందం పక్కనే కూచుంది. భోజనం మధ్యలో చిరునవ్వులు, చిలిపి కబుర్లు చెప్తూనే పోతుంది భోజనాలయ్యాక.

"ప్రేమానందం గారు నా రూంలో అడ్జెస్టైపోతారండి" నిర్మాతతో చెప్పేసింది లవంగి. కాటుక కళ్లను గమ్మత్తుగా తిప్పేస్తూ ప్రేమానందాన్ని మేడమీద తన గదిలోకి తీసుకెళ్లింది. సోఫామీద కూచోబెట్టింది. ముందుకు వంగి కళ్లతో కళ్లు కలిపింది. ట్యూబులైటు వెలుతురు లవంగి చెక్కిళ్లమీద పరావర్తనం చెంది ప్రేమానందం పెదాలమీద దోబూచులాడ్తుంది.

"ఏమిటలా చూస్తున్నారు?" అడిగాడు ఏం చేయ్యాలో తోచక "

"మీరింత గొప్ప యాక్టరనుకోలేదండి! ఏమా స్టెప్పులూ, ఏమా భంగిమలు, అన్నింటిని మించిన ఆ చొరవా. . మీ ముందు సీనియర్ హీరోలంతా బలాదూరే!" గబుక్కున చెంపలందుకుని తన చెంపలకద్దుకుంది.వెచ్చగా హాయిగా, ఏదోలా ఉంది. కొత్త ఉత్సాహం కితకితలు పెడుతూంది.

"నిజంగానా?" లేచి నిల్చున్నాడు కాళ్లు ముందుకెల్లా నంటున్నాయి కాని ఏదో శక్తివెనక్కు లాగుతుంది"

నన్ను ప్రోత్సహించాలని అలా అన్నారు గదూ!" భుజాలందుకోబోయి చేతులు వెనక్కులాక్కున్నాడు.

"కానే కాదు" కిలకిలా నవ్వింది. ఆ నవ్వులో ఎన్నో అర్థాలున్నాయి. "సినీ ఫీల్డులో మొహమాటం కుదరదండీ బాబూ!. . మీరిలా రండి" అంటూ మెడచుట్టూ చేతులేసి బెడ్రూంలోకి నడిపించుకెళ్లింది.

ఏ.సి. రూం. మెత్తని పరుపులు. . సుతిమెత్తని లవంగి చేతులు ఒళ్లంతా తడుముతున్నాయి

ఐతే సిన్మా తారల గురించి విన్నదంతా నిజమేనన్న మాట ఇంకా మల్లగుల్లా లెందుకూ?నరాల్లో హుషారెక్కింది మొహం విచ్చుకుంది. నడుమ్మీద చెయ్యేసి గుండెలకు హత్తుకున్నాడు.

"ఆ... అలా ఉండాలి... అదో కిటికిలోంచి చూడండి... ఆ చందమామ ఏమంటుందో!" భూజల మీద చేతులేసి కిటికీ దాకా తీసుకెళ్లింది.

సిద్ధిపురి అందాలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. భోగేశ్వరాలయ శిఖరమ్మీది లైటు వెలుగులు విద్యుద్దీపాలతో అలంకరించిన లాల్‌కమాన్. బంగాళాల మీద వెన్నెలలు పరుస్తూ నింగిలో ప్రయాణం చేస్తున్న చందమామ .

..చ్చా చూస్తుంటే ఏమొస్తుంది?'' ఒక చేత్తో ఒత్తుగా పెరిగిన మీసం కట్టును దువ్వుతూ మరో చేత్తో పెగ్గుపెదాల కందించింది. మత్తుగా, గమ్మత్తుగా ఉంది రంగురంగుల దృశ్యాలు కళ్లముందు కదులుతున్నాయి ప్రేమానందం వెన్నుపూసలో విద్యుత్తు ప్రవహిస్తోంది ఉత్సాహం .. అత్యుత్సాహం . ఆరాటం .. ఏదో ఆరాటం.. ఆలస్యం అమృతం విషమన్నారు గదా।

"లవ్లీ లవంగి . కమాన్ డియర్!" చెయ్యి బట్టి లాగాడు. మల్లెపూవులా మంచమ్మీద వాలిపోయింది ఇద్దరి కళ్లనిండా కైపు ఒంటినిండా పులకింతలు.

"వెరీగూడ్ లవంగీ.. థాంక్యూ!" అంటూ తానూ మంచమెక్కాడు పెదాలు కలుసుకోబోతున్నాయి "అబ్బ ఆశ!" కళ్లు సగం మూసి "అవ్వవ్వవ్వ. ." నాలుకతో వెక్కిరించింది. మంచం దూకి కిటికీవైపు పరుగెత్తింది.

"నేను గూడా దూకగలను. నిన్ను పట్టుకోగలను లవంగీ!" గబుక్కున దూకేశాడు మంచమ్మీంచి. కాలు కలుక్కుమంది మొకాలులో నొప్పి.

"అబ్బోనొప్పి" ... లేవరా లేదు. "వామ్మో నాకాలు.. నాకాలు లవంగీ..." ఇల్లు దదరిల్లింది.

కంటిరెప్పలు భళ్లున విచ్చుకున్నాయి.

"అయ్యయ్యో.... ఇదేమిటీ? మంచమ్మీంచి పడిపోయారేంటీ. మీకేమైందిదండీ?" లబోదిబోమంటూ పరుగెత్తుకొచ్చింది ప్రేమానంద భార్య.

"అయ్యో ... లవంగీ... లవంగీ..." భార్య మొహంలోకి చూస్తూ గొణుక్కుంటున్నాడు.

"లవంగం కోసం మాంచమ్మీంచి దూకెయ్యాలా? నన్నడితే నేనిద్దును గదండీ.."

"లవంగం కాదు మొద్దుమొహమా! లవంగి నా సిన్మా హిరోయిన్ లవంగి. ఆ ఇదేమిటీ ఇది .. ఇది నిజం కాదా! కలనా?" చేతులు నేలమీద ఆనించి లేవబోయాడు మోకాలులో గుండు సూదులు గుచ్చుకున్నంత నొప్పి. లేవరాలేదు

"ఆదివారం. పట్టపగలు మళ్లీ సిన్మాలో నటిస్తున్నట్టు దిక్కుమాటిన కలొచ్చిందా?" భార్యకళ్లల్లో కోపం గిరికీలు కొడ్తుంది రెండు చేతుల్లో భర్త భుజాలు పట్టి లేపబోయింది పంచప్రాణాలు పైకెగిరి పోయినై. హోటల్ అమరావతి పై అంతస్తునుండి జారి పాతాళలోకంలో పడిపోయినట్టుంది.

"అమ్మో. నా కాలు .. నా కాలూ!" భార్య చేతుల్ని విసిరికొట్టి బోర్ మన్నాడు.

"అయ్యయ్యో ఎంత పనైందండీ!" భార్యగూడా బోర్మంది. గుండెలు బాదుకుంది.

పక్కపోర్షన్ల వాళ్లంతా హుటాహుటిన పరుగెత్తు కొచ్చారు. చుట్టూ మూగారు. సానుభూతి కురిపించారు. హాస్పిటల్లో ఎక్స్రేలు వగైరా పరీక్షలయ్యాక తెలిసింది కాలు విరిగిందని.

(ఆదివారం - ఆంధ్రభూమి - 24-3-1996.)